వాణిజ్య పంటలకు ఊపిరి

- మేలు చేస్తున్న భారీ వర్షాలు
- తీరంలో కొబ్బరి, సరుగుడు తోటలకు ఉపయోగం
- ఉప్పుగాలుల నుంచి ఉపశమనం

మలికిపురం: జిల్లాలో మిగిలిన చోట్ల ఎలా ఉన్నా రాజోలు దీవిలో వ్యవసాయం భిన్న పరిస్థితులను ఎదుర్కొంటోంది. సాగునీటి వసతులు ఉన్నా అవి సార్వా సీజన్‌లో వరికి అక్కరకు రావడం లేదు. దీనికి ప్రధాన కారణం రాజోలు దీవికి చుట్టూ నీరు ఉండడమే. మూడువైపులా గోదావరి నది. మరో వైపు బంగాళాఖాతం. దీనికి తోడు ఇక్కడ డ్రైనేజీ వసతులు సక్రమంగా లేక మొత్తం వరి సాగులో సార్వాలో 60 శాతం వరి కూడా సాగు కావడం లేదు. ఇక నియోజకవర్గంలో మెరక ప్రాంతాల్లో సాగయ్యే వాణిజ్య పంటలకు వర్షాలే ప్రధాన ఆధారం. దీంతో ఇక్కడ గత నెల రోజులుగా కురిసిన వర్షాలకు రాజోలు దీవిలో వాణిజ్య పంటలు ఊపిరి పోసుకున్నాయి. పూర్తిగా సముద్ర తీరంలో ఉన్న ఈ దీవిలో సముద్రం మీద నుంచి వచ్చే వేడి, ఉప్పు స్వభావం కలిగిన గాలులకు ఇక్కడ వ్యవసాయం విలవిలలాడుతుంది. సముద్రం మీద నుంచి వచ్చే ఉప్పు గాలులకు ఇక్కడ కొబ్బరి, సరుగుడు చెట్లు ఎండి పోతుండడమే దీనికి కారణం. మరో వైపు తీరంలో రొయ్యల సాగు కారణంగా కాలుష్యం, ఉప్పునీటి ప్రభావంతో ఇక్కడ ప్రధానంగా వాణిజ్య వ్యవసాయానికి ఇబ్బందిగా ఉంటుంది. గత జూన్ నెల వరకూ ప్రబలిన ఎండల ధాటికి ప్రజలు విలవిల్లాడారు. ఉక్కబోతతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతికారు. రుతుపవనాల రాకతో బ్రతుకు జీవుడా ఉంటూ కాలం నెట్టుకొచ్చారు. అలాగే ఇక్కడ పంటలు కూడా ఇబ్బంది పడ్డాయి. ఎట్టకేలకు గత నెలలో ఏకధాటిగా వర్షాలు కురవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కురిసిన భారీ వర్షంతో రాజోలు నియోజకవర్గంలో ప్రజలు చల్లబడడంతో పాటు వ్యవసాయ రంగానికి మేలు చేశాయి.



వర్షాలతో కళకళలాడుతున్న కొబ్బరి తోటలు, వరి చేలు

సరుగుడు తోటలు కళకళ

వాణిజ్య పంట అయిన సరుగుడు తోటలకు వర్షాలు ఊపిరినిచ్చాయి. నియోజకవర్గంలో సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లో సముద్ర తీరం వెంబడి గ్రామాల్లో సుమారు 40 వేల ఎకరాల సరుగుడు తోటలు విస్తరించి ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షపు నీటితో సరుగుడు తోటలు కళకళలాడుతున్నాయి.

కొబ్బరి తోటలకు ఉపశమనం

సకాలంలో కురిసిన భారీ వర్షాలు ప్రధానంగా కొబ్బరి తోటలకు ఉపశమనం కలిగించాయి. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో సుమారు 70 వేలకు పైగా ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతోంది. అలాగే మరో 25 వేల ఎకరాల్లో మొక్క తోటలు పెరుగుతున్నాయి. వశిష్ఠ గోదావరి తీరంతో పాటు సముద్ర తీరంలో వర్షాలు లేక కొబ్బరికి ఆకు తేలు తెగులుతో పాటు ఇతర వ్యాధులు కూడా సోకాయి. వర్షాలకు పలు తెగుళ్ల తగ్గుముఖం పట్టే అవకాశం ఏర్పడింది. అలాగే సకాలంలో వర్షాలు కురవకపోతే కొబ్బరి పొత్తులు దిగడంలో కూడా వ్యత్యాసం వచ్చి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. గత ఐదేళ్లుగా కొబ్బరి దిగుబడి తగ్గడానికి ప్రధాన కారణం ఇదే.

వర్షంతో ఆకుతేలు తెగులు దూరం



సముద్రతీరం కావడంతో ఎండ తీవ్రతకు కొబ్బరికి వివిధ రకాలు తెగుళ్లు సోకి రైతులను కలవర పెడుతున్నాయి. తెగుళ్లు సోకితే కొబ్బరిని రక్షించుకోవడం కష్టంతో కూడుకున్న పని. ఇందులో ఆకు తేలు, నల్లి తెగులు ప్రధాన మైనవి. ప్రస్తుతం కురిసిన వర్షాల వల్ల కొబ్బరి తోటలకు వ్యాపిస్తున్న ఆకు తేలు అదుపు అవుతుంది.

– తాడి సత్యనారాయణ, రైతు, మట్టపర్రు

అనుకూల వాతావరణం



వర్షాలు బాగా కురిస్తే వాణిజ్య పంటలకు అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. ప్రస్తుతం కురిసిన వర్షాల వల్ల కొబ్బరికి తెగుళ్లు తగ్గాయి. సముద్ర తీరంలోని సరుగుడు తోటలకు కూడా ఉపశమనం కలిగించాయి. కొబ్బరి చెట్ల మొదళ్లను తవ్వి ఎరువులు, సేంద్రియ పదార్థాలు వేసుకుంటే వర్షాల వల్ల చెట్లు బలపడతాయి. కొత్త పొత్తులు వేసి దిగుబడి బాగుంటుంది.

– ఎస్.రాకేష్, వ్యవసాయాధికారి

క్లుప్తంగా

ఆకట్టుకునేలా గాంధీ పెయింటింగ్



శ్రీనివాస్ తీర్చిదిద్దిన గాంధీ ఆయిల్ పెయింటింగ్

మామిడికుదురు: భారత జాతిపిత మహాత్మా గాంధీ ఆయిల్ పెయింటింగ్‌ను ఈదరాడ జెడ్పీ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ బత్తుల శ్రీనివాస్ అద్భుతంగా తీర్చిదిద్దారు. భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గాంధీతో పాటు శాంతి చిహ్నం పావురం, మువ్వన్నెల జెండా, దేశ సైనికుల చిత్రాలతో కూడిన ఆయిల్ పెయింటింగ్‌ను విద్యార్థుల సమక్షంలో శ్రీనివాస్ ఆకట్టుకునేలా చిత్రీకరించారు. ఈ చిత్రం వీక్షకులను అబ్బుర పరుస్తోంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు టీచర్ శ్రీనివాస్‌ను అభినందనలతో ముంచెత్తారు.

ఘనంగా ముత్యాలమ్మ సేవ

అంబాజీపేట: నందంపూడి గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి తీర్థంలో భాగంగా కాపు సామాజిక వర్గీయులు అమ్మవారి పూజాఘటాలను మంగళవారం పురవీధుల్లో ఊరేగించారు. రోజువారీ సామాజిక వర్గాల్లో భాగంగా అమ్మవారి సేవ అత్యంత ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పూజా ఘటాలకు మహిళలు హారతులు పట్టి, పొన్నులు నిర్వహించారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు 20 వరకు గడువు

అంబాజీపేట: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు సంబంధించి అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియెట్, పదో తరగతిలో అడ్మిషన్లకు ఈ నెల 20వ తేదీ వరకు గడువు ఉందని నిర్వాహకుడు నందిక వెంకటేశ్వరరావు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9912703454లో సంప్రదించాలన్నారు.

ఈ-పంట నమోదు వేగవంతం చేయాలి

అంబాజీపేట: ఈ-పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ ఆదేశించారు. పుల్లేటికుర్రు, గంగలకుర్రు, మొసలపల్లి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఈ-పంట నమోదు ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న పంట వివరాల నమోదుతోనే ప్రభుత్వ పథకాలు అందేందుకు వీలవుతుందన్నారు. రైతులు ఏ పంట సాగు చేస్తే ఆ పంటనే నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే దేవకు వినతిపత్రం ఇస్తున్న నాగేశ్వరరావు

మలికిపురం: కొబ్బరి కార్మికులకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర కొబ్బరి కార్మిక సంఘం అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు మలికిపురంలో వినతిపత్రం అందించారు. కొబ్బరిపై ఆధారపడి అనేక మంది కార్మికులు పని చేస్తున్నారని వారికి రక్షణ లేదన్నారు. ఎమ్మెల్యే దేవ సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి తెలియజేస్తానని హామీ ఇచ్చారు.

కేసు పెట్టిన భార్య: భర్త అదృశ్యం

మామిడికుదురు: భార్య కేసు పెట్టిందని భయపడి భర్త ఇంటి నుంచి వెళ్లి పోయాడు. ఈ సంఘటన పాశర్లపూడిలో జరిగింది. నగరం హెడ్ కానిస్టేబుల్ కేఎన్‌డీ ప్రసాద్ తెలిపిన వివరాలిలా.. పాశర్లపూడికి చెందిన వేగి వెంకటరత్నంకు 2021లో పేరూరుకు చెందిన పావనితో వివాహం జరిగింది. అప్పటి నుంచి వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. పది రోజుల క్రితం పావని ఫిర్యాదుపై నగరం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఇద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కానీ మళ్లీ ఇద్దరి మధ్య గొడవ జరగడంతో పావని పుట్టింటికి వెళ్లిపోయింది. భర్తపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భార్య కేసు పెట్టిందని భయపడిన వెంకటరత్నం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై అతడి తండ్రి వెంకటేశ్వరరావు చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని హెచ్‌సీ మంగళవారం తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండ గ్రామంలోని మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 45 మందికి కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారిలో ఐదుగురికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసేందుకు నిర్ధారించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యం వహించారు. కంటి ఆస్పత్రి వైద్య బృందం పాల్గొన్నారు.

త్రివర్ణ పతాకాలతో విద్యార్థుల ర్యాలీ



మామిడికుదురులో త్రివర్ణ పతాకాలతో బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ



సఖినేటిపల్లి పంచాయతీ వద్ద జాతీయ నాయకుల విగ్రహాలను శుభ్రం చేస్తున్న బీజేపీ శ్రేణులు



రావులపాలెం జాతీయ రహదారిపై జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మామిడికుదురు: దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం మామిడికుదురులో త్రివర్ణ పతాకాలతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. దీప్తి స్కూల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ 216వ నంబర్ జాతీయ రహదారి మీదుగా సాగింది. మాతరం ... మాతరం.. వందే మాతరం, భారత్ మాతాకీ జై అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాలూరి జయప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, ఆ పార్టీ నేతలు అడబాల రాంబాబు, ఈలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో జాతీయ నాయకుల విగ్రహాల శుభ్రత

సఖినేటిపల్లి: హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా బీజేపీ శ్రేణులు మంగళవారం సఖినేటిపల్లిలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పంచాయతీ వద్ద ఉన్న జాతీయ నాయకుల విగ్రహాలను పరిశుభ్రం చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, కిసాన్ మోర్చా రాష్ట్ర డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు పరిశుభ్రతకు శ్రీకారం చుట్టారు. అనంతరం వారిరువురు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఈ నెల 9 తేదీ నుంచి 15వ తేదీ వరకూ జాతీయ పార్టీ పిలుపు మేరకు దేశభక్తి భావాలను పెంపొందింపచేసే విధంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రధాన కార్యదర్శి కొణతం శ్రీనివాసరావు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

రావులపాలెంలో..

రావులపాలెం: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జాతీయ జెండాతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన కళాశాల నుంచి విద్యార్థులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది జాతీయ జెండాలను పట్టుకొని హైవేపై ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై, స్వాతంత్ర్య అమరవీరులకు జోహార్, భారతీయులంతా ఒక్కటే, సాధిద్దాం స్వాతంత్ర్య అమరవీరుల ఆశయాలను అంటూ నినాదాలు చేశారు. మెయిన్ రోడ్డు బస్టాండ్ అవుట్ గేట్ వద్ద మానవహారంగా ఏర్పడి స్వాతంత్ర్య నినాదాలను చేస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్, అధ్యాపకులు సత్యమూర్తి, బీపీఎస్ రెడ్డి, సుభాషిని, రజని, సుమలత, రాజేంద్ర, శ్రీనివాస్, ప్రసాద్, దుర్గాదేవి, సౌజన్య, యువరాజ్, జెస్సి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడి వైద్యానికి రూ.15 వేల సాయం

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడికి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు మంగళవారం రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. కపిలేశ్వరం మండలం కేదార్లంక గ్రామానికి చెందిన సాదా సుబ్రహ్మణ్యం (43) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకి తీవ్ర గాయాలతో రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యశ్రీలో ఇప్పటి వరకు వైద్యం చేశారు. లిమిట్ అయిపోవడంతో సొంత డబ్బులు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఇటుక బట్టీలో పని చేసే అతడికి అంత ఆర్థిక స్తోమత లేకపోవడంతో బంధువులు విరాళాలు సేకరించి వైద్యం చేయిస్తున్నారు.

కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరడంతో రావులపాలెం లో పేషెంట్ తమ్ముడు జానకి రామయ్యకి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ. 15 వేల నగదును సాయంగా అందజేశారు.



బాధితుడి బంధువుకు సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

అసంపూర్తిగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు

అంబాజీపేట: మాచవరం పంచాయతీ పరిధి డైలీ మార్కెట్‌లో లక్షలాది రూపాయలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్, చేపల విక్రయాల షెడ్‌ల అరకొరగా నిర్మించడంతో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. 2018లో డైలీ మార్కెట్‌లో చేపలు, మాంసం, కూరగాయల విక్రయాలకు పంచాయతీ నిధుల నుంచి రూ.లక్షలు వెచ్చించి చేపల షెడ్డు, మాంస విక్రయాలకు షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించారు. అయితే వాటిని అసంపూర్తిగా నిర్మించి అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు గాలికొదిలేశారని స్థానికులు బహిరంగానే విమర్శిస్తున్నారు. భవన నిర్మాణాలకు ఉపయోగించే సుమారు 50 బస్తాల సిమెంట్ శిథిలమైనా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రతి రెండేళ్లకోసారి పన్నులు వసూలు చేసుకునేందుకు వేలం నిర్వహిస్తున్నారే తప్ప మార్కెట్‌లో కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు పంచాయతీ పాలకవర్గం దృష్టి సారించడం లేదని వాపోయారు. చీకటి పడితే విద్యుత్ దీపాలు ఉండవని విక్రయదారులు వాపోయారు. చేపల షెడ్డులో మురికి నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. షాపింగ్ కాంప్లెక్స్ భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో మాంసం విక్రయదారులు ఆరు బయట వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం, అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించడంతో పాటు వినియోగంలోకి తీసుకురావాలని పలువురు వ్యాపారులు, స్థానికులు కోరుతున్నారు.



మాచవరం డైలీ మార్కెట్‌లో అసంపూర్తిగా షాపింగ్ కాంప్లెక్స్, చేపల షెడ్లు

డీడీఎన్ఎస్ సాయం పెంపుపై హర్షం

కొత్తపేట: దేవదాయ శాఖ పరిధిలోని చిన్న ఆలయాలకు అందించే ఆర్థిక సాయాన్ని రూ.10 వేలకు పెంచడంపై రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల సంఘం మాజీ కార్యదర్శి దూనబోయిన నారాయణరావు హర్షం వ్యక్తం చేశారు. ఆ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రూ.50 వేల లోపు వార్షిక ఆదాయం ఉండే ఆలయాల్లో నిత్య పూజలతో పాటు అర్చకుల గౌరవ వేతనం, ధూప దీప నైవేద్యం పథకం (డీడీఎన్ఎస్) ద్వారా ప్రతి నెలా అందించే రూ.5 వేల సాయాన్ని రూ.10 వేలకు పెంచుతున్నట్టు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించారని తెలిపారు. ప్రభుత్వం అందిచే ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావాలని అర్చకులను నారాయణ రావు కోరారు.

అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం

మలికిపురం: మండలంలోని దిండి వంతెన వద్ద తన మోటార్ బైక్ ఉంచి అక్కడ నుంచి అదృశ్యమైన మలికిపురానికి చెందిన పడమటి నోయల్ జార్జి(19)మృతదేహం మంగళవారం సఖినేటిపల్లి మండలం పల్లిపాలెం వశిష్ఠ గోదావరి తీరాన లభ్యమైంది. అనుమానాస్పద మృతిగా పరిగణించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు. కాగా మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు ఎస్సై అన్నారు.

కొనసాగుతున్న శిక్షణ తరగతులు

ఆత్రేయపురం: మండలంలోని సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు రెండోరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామాల్లో శిక్షణ నిర్వహించారు. ర్యాలి గ్రామంలో తడిచెత్త, పొడి చెత్త వేరు చేయుటకు, వర్మీ కంపోస్టు తయారు చేయుటపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అంబాజీపేట: గ్రామ పంచాయతీలకు ఆదాయాన్ని పెంచేందుకు పంచాయతీ కార్యదర్శులు, పాలకవర్గాలు కృషి చేయాలని ఎంపీడీఓ జి.సరోవర్ సూచించారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణలో భాగంగా రెండో రోజు మంగళవారం నిర్వహించారు. గ్రామ పంచాయతీ విధులు, శానిటేషన్, అభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బి.మమత తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5 వరకూ పంచాయతీ సెక్రటరీలకు రెండో రోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి అధ్యక్షతన జరిగింది. మొదటిరోజు శిక్షణ పునశ్చరణతో కార్యక్రమం మొదలు పెట్టి రెండో రోజు శిక్షణ అంశాలు పారిశుధ్యం, చెత్త సేకరణ, వర్మీ కంపోస్ట్ మార్కెటింగ్ మొదలైన అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.మంగాదేవి, పరిపాలన అధికారి జి.మిల్టన్ తదితరులు పాల్గొన్నారు.


ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పునరుద్ధరించి గ్రామ పంచాయతీలకు తగిన ఆదాయ వనరులు సమకూర్చాలని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరులోని పసుపులేటి వారి గూడెంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ఎంపీడీఓ ఎ.మేరీ రోజ్ అధ్యక్షతన రెండో రోజైన మంగళవారం గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు జరిగాయి. ఈఓపీఆర్‌డీ పీఆర్‌సీ రాజ్‌కుమార్, ఏఓ వి.రామ్ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: గ్రామ పంచాయతీ నిధులతో చేపట్టే పనులకు ముందుగా ప్రణాళిక రూపొందించుకుని దానికి అనుగుణంగా అభివృద్ధి చేయాలని ఏఓ కె.వెంకటేశ్వరరావు సూచించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ తరగతుల్లో భాగంగా రెండో రోజు మంగళవారం పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. పాశర్లపూడిలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం వద్ద ప్రజల నుంచి సేకరించిన తడి, పొడి చెత్త నుంచి సంపద తయారీ విధానంపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ తోట శ్రీనివాస్, సర్పంచ్‌లు, కార్యదర్శులు సమావేశంలో పాల్గొన్నారు.


రావులపాలెం: పంచాయతీ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు పంచాయతీ రిఫ్రెషర్ ట్రైనింగ్‌లో భాగంగా మంగళవారం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అధికారులు అవగాహన కల్పించారు. అలాగే గ్రామాల్లో ప్లాస్టిక్ నిర్మూలనకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఈఓపీఆర్డీ కృష్ణ, ఏఓ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



మేడిచర్లపాలెంలో క్షేత్ర పరిశీలన చేస్తున్న సర్పంచులు, కార్యదర్శులు



మామిడికుదురు శిక్షణ సమావేశంలో అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు

తాగునీటి కుళాయి నుంచి చేప పిల్ల



మామిడికుదురులో తాగునీటి కుళాయి నుంచి వచ్చిన చేప పిల్ల

మామిడికుదురు: మామిడికుదురు గ్రామంలో తాగునీటి కుళాయిల నుంచి తరచు చేప పిల్లలు రావడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కుళాయి వాటర్ పట్టగా ఆ వాటర్‌లో చేప పిల్ల వచ్చిందని స్థానికులు రుద్రా శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజుల వ్యవధిలో మూడు సార్లు కుళాయిల నుంచి చేప పిల్లలు వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీరు ఇలా కలుషితం అవుతుంటే ఎలా తాగేదని ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదన్నారు. దీనిపై అధికారులు తక్షణం స్పందించి తాగునీటిలో చేప పిల్లలు రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయశ్రీని వివరణ కోరగా దీనిపై పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా భారీ ఉద్యమం



మామిడికుదురు సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

మామిడికుదురు: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా భారీగా ఉద్యమించాలని మామిడికుదురులో జరిగిన నాలుగు మండలాల మాల మహానాడు నేతల సమావేశం తీర్మానించింది. మాల మహానాడు సీనియర్ నేత నల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ ఈ నెల 21న తలపెట్టిన భారత్ బంద్ ద్వారా మాలల సత్తా చూపించాలన్నారు. భారత్ బంద్ విజయవంతం చేయడంతో పాటు భవిష్యత్ కార్యాచరణ కోసం కోర్ కమిటీలను ఏర్పాటు చేశారు. సమావేశంలో మట్టా సత్తిబాబు, తాడి సహదేవ్, చోటే రాజేష్, మట్టా సురేష్, బొంతు మణిరాజు, కలిగితి పళ్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా స్కూల్ షెడ్



ఆదుర్రులో శిథిలస్థితికి చేరిన స్కూల్ షెడ్

మామిడికుదురు: ఆదుర్రు గ్రామంలోని బౌద్ధ స్తూపం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల షెడ్ శిథిలస్థితికి చేరింది. వర్షం కురిస్తే చాలు షెడ్ లోపలికి వర్షం నీరు వచ్చి చేరుతోంది. ఈ షెడ్ ఏ క్షణంలో కూలిపోతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. దీని చుట్టూ బరకాలు కట్టి, షెడ్డుపై భాగంలో టార్పాలిన్ వేశారు. ప్రస్తుతం ఈ షెడ్‌లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ 23 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కాగా శిథిలస్థితికి చేరిన షెడ్‌ను సోమవారం జిల్లా సమగ్ర శిక్ష ఎఫ్ఏఓ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. ఈ భవనం పరిస్థితిని డీఈఓ ఎం.కమలకుమారి, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.మధుసూదన రావుకు ఫోన్‌లో వివరించారు. వారి వెంట ఎంఈఓలు ఎస్.లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు, హెచ్‌ఎం తోట రామారావు ఉన్నారు.

ఆడింది కోడిపందేలు కాని.. పేకాటగా కేసు నమోదు

ఆలమూరు: మండలంలోని మోదుకూరులో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై మంగళవారం దాడి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామ శివార్లలో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నలుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకోగా మిగిలిన వారు పరారయ్యారు. అదుపులోకి తీసుకున్న వారిలో గొడితి రాజు, పీవీవీ సత్యనారాయణ, కొవ్వాడ నవీన్, గంధం విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆ నిందితుల వద్ద నుంచి రూ.2900 స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తులంతా గత వారం రోజుల నుంచి కోడి పందేలు నిర్వహిస్తున్నారని చెబుతుంటే పోలీసులు మాత్రం పేకాట శిబిరంపై దాడి చేసి నిందితులను అరెస్ట్ చేశామని చెబుతున్నారు. పేకాట శిబిరంపై దాడి చేసి ఆ మేరకు నిందితులను అరెస్ట్ చేసి కేసును నమోదు చేసినట్లు ఎస్సై ఎం.అశోక్ పేర్కొన్నారు.

అధికార పార్టీ నేతల ఒత్తిడి వల్లే!

అధికార పార్టీ నేతల ఒత్తిడి వల్లే కోడి పందేల కేసును పేకాట కేసుగా మార్చు చేశారంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కోడి పందేలు ఆడుతున్న సమయంలో కోళ్లు లభ్యం కాకపోవడం లేదా ఉద్దేశ పూర్వకంగా కేసును నీరుగార్చేందుకు కోళ్లను వదిలేయడం కాని జరిగి ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. దీంతో కేసు తీవ్రతను తగ్గించేందుకు పోలీసు అధికారులు కేసును మార్చి వేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కోడి పందేల స్థావరంపై దాడి చేసిన సంఘటన సమయంలో అనేక ద్విచక్ర వాహనాలు ఉన్నా వాటిని అదుపులోకి తీసుకోకపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.